# యథార్థ ఘటనలకు దృశ్య రూపమే యాత్ర–2

- ప్రజాసంకల్పయాత్ర నేపథ్యంలో ఆద్యంతం అలరించిన చిత్రం
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన థియేటర్
- అభిమానులతో కలిసి సినిమా వీక్షించిన వైఎస్సార్ సీపీ నాయకులు



యాత్ర-2 ప్రదర్శిస్తున్న సునీల్ థియేటర్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, సమన్వయకర్త నిసార్‌అహ్మద్

**మదనపల్లె :** ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిత్వం, తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు ఆయన పడిన కష్టాలేంటి ? ఢిల్లీ పెద్దలు కాదన్నా... తనను నమ్ముకున్న ప్రజల కోసం అండగా ఉండేందుకు జగన్ చేపట్టిన పాదయాత్ర... వైఎస్సార్ సీపీ స్థాపించేందుకు గల కారణాలు తదితర యదార్థ సంఘటనలకు దృశ్య రూపమే యాత్ర-2 సినిమా అని మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. గురువారం యాత్ర-2 సినిమా విడుదల సందర్భంగా పట్టణంలోని శ్రీకృష్ణ, సునీల్ థియేటర్లలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు సందడి చేశారు. సునీల్ థియేటర్ వద్ద మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులతో కలిసి ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినదించి, కార్యకర్తలు, అభిమానులు, నాయకులతో కలిసి సినిమా వీక్షించారు. సినిమాలో మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, సీఎం జగన్ పాత్రధారులు తెర మీద కనిపించినప్పుడు, సంభాషణల్లో వారి ప్రస్తావన వచ్చినప్పుడు జై వైఎస్సార్, జై జగన్ అంటూ థియేటర్‌ను హోరెత్తించారు. వైఎస్సార్ సీపీ జెండాను థియేటర్‌లో ఊపుతూ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ తనయుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర నేపథ్యం... పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్న ఉదంతం, ప్రత్యర్థులు చేసిన కుట్రలను ధైర్యంగా ఎదుర్కొని, ప్రజానాయకుడిగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎదిగిన వైనాన్ని సినిమాలో దర్శకుడు కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. నమ్ముకున్న వాళ్ల కోసం వైఎస్సార్ కుటుంబం ఎలాంటి భరోసా ఇస్తుంది.. మాట ఇస్తే నిలుపుకొనేందుకు ఎంతగా శ్రమిస్తారు.. ప్రజాసంకల్పయాత్రలో ప్రజలతో వైఎస్.జగన్ మమేకమైన తీరు, వారి కష్టాలను అర్థం చేసుకుని, నవరత్నాల పథకాలకు రూపకల్పన చేయడం తదితర అంశాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని దర్శకుడు మహి చక్కగా చూపించారని, సినిమా ఆద్యంతం ప్రేక్షకులను అలరిస్తుందని చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరూ సినిమాను చూసి, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దండుకరుణాకర్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, బాలగంగాధరరెడ్డి, పాల్‌బాలాజీ, జేసీఎస్ కన్వీనర్లు మునిశేఖర్, బావాజీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, రాజేష్, ఈశ్వర్‌నాయక్, ఆర్.శివయ్య, ఎం.వి.రమణ, డిష్‌రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఆర్టీఏ నూర్, ఎల్‌ఐసీ.సుధాకర్, చరణ్, ఆంజనేయులు, సర్పంచ్ శరత్‌రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న సురక్ష

- పేదవాడి ఇంటి ముంగిటకే వైద్యసేవలు
- ఆరోగ్యశ్రీ పరిధి రూ.25 లక్షలకు పెంపు
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మనూజారెడ్డి

**మదనపల్లె :** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని సాధించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని 31వ వార్డులో కౌన్సిలర్ సింధులూరి రజని ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్యసురక్ష-2 కార్యక్రమం జరిగింది. ప్రజలకు వైద్యసేవలు అందించడంతో పాటుగా ప్రభుత్వం కొత్త ఫీచర్లతో రూపొందించిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం, ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలకు వారి ఇంటి ముంగిటిలోనే పరిష్కారాన్ని, వైద్యసేవల్ని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెడితే, ఆయన కుమారుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీకి మరిన్ని మెరుగులు దిద్దుతూ రూ.25లక్షల వరకు ఉచిత వైద్యం అందించేలా చర్యలు చేపట్టారన్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లోని పేరుమోసిన ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో సాగుతున్న ప్రజారంజక పాలన కలకాలం కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోకుండా, జగనన్న ప్రభుత్వంలో మంచి జరిగిందన్న నమ్మకం ఉంటేనే ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించండన్నారు. కార్యక్రమంలో నరిబాబాయ్, కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, ఈశ్వర్‌నాయక్, డిష్ రామకృష్ణారెడ్డి, ఎస్వీ రమణ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, చేనేత విభాగ కమిటీ జోనల్ ఇన్‌చార్జి భువనేశ్వరి సత్య, క్రైస్తవ విభాగం జిల్లా అధ్యక్షులు బోనాసిజాన్ బాబు, జేసీఎస్ కన్వీనర్లు మునిశేఖర్, బావాజీ, సర్పంచ్ శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ప్రజ్ఞా వికాస్ పరీక్ష



పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

**మదనపల్లె సిటీ :** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస్ పరీక్ష నిర్వహించారు. ప్రశ్నాపత్రాలను విజయ భారతి పాఠశాల కరస్పాండెంట్ సేతు విడుదల చేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ పరీక్షలకు ఏ విధంగా చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చునో వివరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉజ్వల స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, ఉపాధ్యాయులు ఆర్‌వీ రమణ, బావజాన్, పుణ్యవతి, అన్వర్‌బాషా, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

### ఇష్టపడి చదవండి



మోడల్ స్కూల్ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

**పెద్దతిప్పసముద్రం :** ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఎంఈఓ నారాయణ, ఎంఈఓ-2 గౌస్‌పీర్, ప్రిన్సిపాల్ శివ కుమారి సూచించారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్‌లో పదవ, 12వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పరీక్షలు వస్తున్న నేపథ్యంలో విద్యార్థులు భయాందోళనలను వీడి.. భవిష్యత్తులో ఏం సాధించాలనుకుంటున్నారో ఆ దిశగా ముందడుగు వేయాలని తెలిపారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని హితబోధ చేశారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఇటు కన్నవాళ్లకు, అటు పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


### జడ్జికి సన్మానం



జడ్జి ప్రశాంత్‌ను సన్మానిస్తున్న అధికారులు

**పీలేరు :** మండలంలోని ముడుపులవేముల పంచాయతీ విద్యానగర్ ఎస్సీ కాలనీకి చెందిన రిటైర్డ్ ఏపీపీ పల్లెపాగు శ్రీనాథ్ కుమారుడు పల్లెపాగు ప్రశాంత్ ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నికైన విషయం విదితమే. గురువారం విద్యానగర్ ఎస్సీ కాలనీలో ప్రశాంత్‌ను ఆయన నివాసంలో పలువురు అధికారులు కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చదువుతోనే ఉన్నత విలువలు, పేదరిక నిర్మూలన సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీవో మురళీమోహన్ రెడ్డి, ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రాజేష్, ఏపీవో మహేష్, వివిధ సంఘాల నాయకులు పాలకుంట శ్రీనివాసులు, బోడేషా, ధరణికుమార్, గండికోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### పీలేరు ఎంపీడీవోగా ఉపేంద్రరెడ్డి



**పీలేరు :** పీలేరు ఎంపీడీవోగా ఉపేంద్రరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఎంపీడీవోగా పని చేస్తున్న మురళీమోహన్‌రెడ్డి బదిలీపై తిరుపతి జిల్లాకు వెళ్లారు. కేవీపల్లె ఎంపీడీవోగా పని చేస్తున్న ఉపేంద్రరెడ్డి బదిలీపై పీలేరుకు వచ్చారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

### బి.కొత్తకోట ఎస్ఐగా దిలీప్‌కుమార్

**బి.కొత్తకోట :** స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా దిలీప్‌కుమార్‌ను నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. పీలేరులో పని చేస్తున్న దిలీప్‌కుమార్‌ను ఇక్కడికి బదిలీ చేయగా గురువారం ఆయన బాధ్యతలను చేపట్టారు. అనంతరం సీఐ సూర్యనారాయణను కలిశారు.

### నేడు ఓపెన్ డే

**మదనపల్లె సిటీ :** స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణవేణి తెలిపారు. రానున్న విద్యా సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని.. ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులకు కాలేజీ సందర్శనార్థం ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలేజీలో ఓపెన్ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాలేజీలో అధునాతన బోధనా సదుపాయాలు , ప్రయోగశాలలు, నైపుణ్య అనుభవం కలిగిన అధ్యాపకులు కాలేజీలో ఉన్నారన్నారు. కాలేజీని సందర్శించి ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు.

# ఎన్నికల విధులు సమర్థంగా నిర్వర్తించాలి



పీలేరు రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో ఎస్.రమా



పెద్దమండ్యం: రెడ్డివారిపల్లె పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**పీలేరు రూరల్ :** ఎన్నికల విధులు సమర్థంగా నిర్వర్తించాలని ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్‌వో) ఎస్. రమా అన్నారు. గురువారం స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం 163కు సంబంధించి తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌వోలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలన్నారు. బీఎల్‌వోలకు సంబంధించి రిజిస్టర్లు విధిగా నమోదు చేయాలన్నారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8 సవరణలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు ఎస్.మహబూబ్‌బాషా, విజయకుమారి, ప్రదీప్, నయాజ్‌అహ్మద్, ఖాతిజున్‌కుబ్రా తదితరులు పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాల తనిఖీ**

**పెద్దమండ్యం:** సాధారణ ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ బి.లక్ష్మీనాయక్ ఇతర శాఖల అధికారులతో కలిసి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. మండలంలోని కనుమలోపల్లె, బండెపురెడ్డిగారిపల్లె, పెద్దమండ్యం, రెడ్డివారిపల్లె పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు తాగునీటి సౌకర్యం, వికలాంగులకు ర్యాంప్, వీల్‌చైర్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ గౌరీశంకర్, ఎంఈవో 2 రామక్రిష్ణ, ఆర్ఐ రమేష్‌లు పాల్గొన్నారు.

# తాగునీటికి రూ.5 కోట్లు ఖర్చు చేశాం



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అబ్దుల్ మతీన్

**పీలేరు రూరల్ :** గడిచిన మూడు సంవత్సరాల్లో పీలేరు నియోజకవర్గంలో తాగునీటికి రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేశామని మదనపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అబ్దుల్ మతీన్ అన్నారు. గురువారం పీలేరులో జరుగుతున్న పైపులైన్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా నియోజకవర్గంలో ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 275 బోర్లు వేశామని, 595 మోటార్లు ఏర్పాటు చేశామని చెప్పారు. రేగళ్లు పంచాయతీ కాడంవారిపల్లె వద్ద రూ.24 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పీలేరు సమ్మర్ స్టోరేజ్ నుంచి రూ.20 లక్షలతో స్థానిక ఇందిరమ్మ కాలనీకి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో జరుగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మిగిలిపోయిన పనులను నాడు- నేడు పథకంలో డ్వాక్రా స్వయం సహాయక మహిళా సంఘాలు, గ్రామ జల సంఘాల ద్వారా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప, జేఈ నాగరాజనాయక్, సర్పంచ్ హరిణి పాల్గొన్నారు.

# మామిడి రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు

**పీలేరు రూరల్ :** మామిడి రైతులు తమ పంటకు మంచి గిట్టుబాటు ధర పొందడానికి అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడ) సంస్థ కింద పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. గురువారం మండలంలోని తలపులోలని అన్నమయ్య రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడిలో బెనేషాన్, హిమామ్ పసంద్, కేసర్, ఖాదర్, సువర్ణ రేఖ లాంటి రకాలు సాగు చేసిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలా చేస్తే ఆ సంస్థ వారే పంట వద్దకు వచ్చి మంచి ధరతో కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో సుకుమార్‌రెడ్డి, అన్నమయ్య రైతు సహకార సంఘం అధ్యక్షుడు జయబ్బనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఎనర్జీ హార్వెస్టర్ ప్రాజెక్టుకు స్టార్ హోదా



గ్రీన్ ఎనర్జీ హార్వెస్టర్ ప్రాజెక్టుతో గైడ్ టీచర్, విద్యార్థులు

**మదనపల్లె సిటీ :** జాతీయ స్థాయిలో ఈ నెల 6 నుంచి 8 వరకు నేషనల్ ఇన్నోవేషన్ కౌశిల్ నిర్వహించిన సైన్సు పోటీల్లో మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన గ్రీన్ ఎనర్జీ హార్వెస్టర్ ప్రాజెక్టుకు స్టార్ హోదా దక్కింది. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి సుమారు రెండు వేల వరకు ప్రాజెక్టులు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఇందులో మొదటి 30 ప్రాజెక్టులకు స్టార్ హోదా ఇచ్చారు. ఇందులో సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల స్టార్ హోదాకు ఎంపికైంది. ఈ ప్రాజెక్టుకు పాఠశాల ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డి గైడ్‌గా వ్యవహరించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతోపాటు సాంకేతిక సాయం అందించనున్నట్లు ఎంహెచ్‌ఆర్‌డీ ప్రకటించారు. ప్రాజెక్టును విద్యార్థులు అభినయ్, శ్రావణ్, రోహిత్, రాయ్, ఉదయ్ తయారు చేశారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం రుషికేశవ్, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

# జోనల్ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభ




ట్రోఫీ అందుకుంటున్న వాలీబాల్ టీం సభ్యులు

**కలికిరి :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో గ్రామీణ క్రీడాకారులు తమ సత్తా చాటుకుంటున్నారు. ఇటీవల మహిళా విభాగం వాలీబాల్ పోటీలలో నియోజకవర్గ స్థాయిలో కలికిరి-2 సచివాలయ పరిధిలోని మహిళల టీం సత్తా చాటింది. డివిజన్ స్థాయిలో మండలంలోని గుట్టపాళెం గ్రామానికి చెందిన యువకుల టీం వాలీబాల్ పోటీలలో విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ వెంకటరెడ్డి చేతుల మీదుగా టీం కెప్టెన్ శ్రీకాంత్, వైస్ కెప్టెన్ షాతాప్, టీం సభ్యులు ట్రోఫీ, మెడల్స్, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పరుశురాం, కార్యదర్శి గోపి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకన్న ఆలయం ముస్తాబు



దేవాలయ ఆవరణలో వేసిన చలువు పందిర్లు



విద్యుత్ దీప కాంతులతో అలరారుతున్న ఆలయం

**తంబళ్లపల్లె :** మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమై 19వ తేదీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, పలు రకాల రంగవల్లులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సంప్రదాయబద్ధంగా వేదపండితుల మంత్రోచ్చారణలతో ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 10న ధ్వజారోహణం, 15న కల్యాణోత్సవం, గరుడ వాహనం, 16న రథోత్సవం, 18న చక్రస్నానం, ధ్వజారోహణం, 19న పుష్పయాగం కార్యక్రమాలు కనువిందుగా జరుగుతాయన్నారు. భక్తులు ఈ ఉత్సవాలు తిలకించి స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. గ్రామస్తుల ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తామన్నారు.

# అన్నసంతర్పణ విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

**తంబళ్లపల్లె :** మహాశివరాత్రి పర్వదినాన మల్లయ్య కొండపై జరిగే ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మల్లయ్యకొండ కింద మల్లయ్యకొండ అన్నదాన ట్రస్టు ప్రతి ఏడాది అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా సమష్టిగా విజయవంతం చేయాలని ఆ ట్రస్టు చైర్మన్ రమణారెడ్డి కోరారు. గురువారం ఐటీఐ ఎదురుగా ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద అన్నదాన కమిటీ సమావేశం జరిగింది. అన్నదాన ఏర్పాట్లు, బస్సుల రాకపోకలు, వంటల తయారీపై చర్చించారు. కమిటీ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# నిధులను అభివృద్ధి పనులకు వినియోగించాలి



మాట్లాడుతున్న పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి

**చిన్నమండెం :** ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఫైనాన్స్ నిధులను మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు వినియోగించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీపీఓ మాట్లాడారు. మంజూరైన నిధులను వీధి లైట్లు, బల్బులు, క్లాప్ మిత్ర జీతాలు తదితర వాటికి ఖర్చు చేయాలన్నారు. అదే విధంగా మరో విడత నిధులు మార్చి నెలాఖరులోగా విడుదలవుతాయన్నారు. సర్పంచుల సహకారం తీసుకొని మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఆర్‌పీ అష్రఫ్ అలీ, ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ వినోద్ కుమార్

**నందలూరు(రాజంపేట) :** ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, ఎస్ఐ మహమ్మద్ జహీర్‌లు తెలిపారు. జాతీయ 35వ భద్రతా మాసోత్సవాలు సందర్భంగా గురువారం నందలూరు షాదీఖానాలో ఆటో డ్రైవర్లకు, సుమో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అలా చేస్తే రూ. 10 వేలు జరిమానా విధిస్తామని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు ఓవర్ లోడ్ ఎక్కించుకోరాదని, లైసెన్సు, ఆర్‌సీ, ఇన్సురెన్సు, ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్ని పత్రాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ సిబ్బంది అంజిరెడ్డి, గణేష్, హోంగార్డు బివి సుబ్బారెడ్డి, ఆటో డ్రైవర్లు, సుమో డ్రైవర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు

**రాజంపేట రూరల్ :** విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్సు విభాగం పర్యవేక్షక ఇంజనీర్ డీపీఈ(తిరుపతి) శ్రీనివాస్ బాబు హెచ్చరించారు. స్థానిక నార్త్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్‌శాఖ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్త్ సెక్షన్ సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. అనంతరం రాజంపేట టౌన్‌లో, పుల్లంపేట మండలం పాపక్కగారిపల్లి, అనంతరాజుపల్లి, బోటుమీదపల్లెల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. వీటిలో అడిషనల్ లోడ్ 17కు గాను రూ. 55 వేలు, విద్యుత్ చౌర్యం కేసులు 14కుగాను రూ. 1,05,000, ఇతర చౌర్యం కేసులు మూడుకు గాను రూ. 14 వేలు జరిమానాలు విధించారు. ఈ తనిఖీలలో కడప డీపీ సిబ్బంది, రాజంపేట సిబ్బంది పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నివారణకు సహకరించండి

**ఓబులవారిపల్లె :** కుష్టువ్యాధి నివారణకు అందరూ సహకరించాలని వైద్యాధికారిణి రూప అన్నారు. గురువారం మంగంపేట ఉప ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ వ్యాధి నివారణ మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కుష్టువ్యాధి సోకిన వెంటనే చికిత్స చేయించుకోవాలని, చర్మంపై మచ్చలు రావడం, ఎరుపు రంగులో కాలిపోయిన మచ్చలు రావడం, చర్మంపై బుడపులు చెవి, ముఖం, కాళ్లపై వచ్చినప్పుడు గుర్తించి వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లాలస తదితరులు పాల్గొన్నారు.

### కొత్త ఓటరు కార్డులు

**బి.కొత్తకోట :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులైన రైతులకు కొత్త ఓటరు కార్డులను జారీ చేస్తున్నట్లు చైర్మన్ అమరనాథ్, డీసీసీబీ మేనేజర్ శివారెడ్డి, సీఈవో ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘంలో ఓటు హక్కు కలిగిన రైతులు ఆధార్ జిరాక్స్ కాపీ, రెండు ఫొటోలు, ఫోన్ నంబర్ వివరాలను తెలియజేయాలని కోరారు.

### నేడు గడపగడపకు మన ప్రభుత్వం

**ములకలచెరువు :** మండలంలోని మద్దినాయునిపల్లి పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగునని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారని వారు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, నామినేటెడ్ పదవులు కలిగిన నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు శిక్షణ

**మదనపల్లె :** ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా మదనపల్లెలోని స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.ఓబులేషు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ తెలిపారు. గురువారం కళాశాల విడుదల చేసిన పత్రికా ప్రకటనలో... డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు శిక్షణా తరగతులు ఫిబ్రవరి 13 నుంచి ప్రారంభమవుతాయన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులందరూ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోర్సు వ్యవధి నాలుగు నెలలుగా పేర్కొన్నారు. వివరాలకు 9553202509 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### సింగిల్ విండోలో ఈకేవైసీ సమర్పించండి

**వాల్మీకిపురం :** స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో)లో సభ్యత్వం కలిగిన వారు ఈకేవైసీ సమర్పించాలని సింగిల్ విండో అధ్యక్షులు శ్రీధర్‌రాయల్ అన్నారు. స్థానికంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. సింగిల్ విండోలో వివిధ రకాల రుణాలు తీసుకున్న వారు, డిపాజిట్ చేసిన వారు, బంగారు రుణాలు పొందిన వారు ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, 1బి, జిరాక్స్ కాపీలు, సంఘం మెంబర్ నామిని వివరాలతో 12వ తేదీలోపు సీఈవోకు సమర్పించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నరసింహారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### కబడ్డీ టోర్నీ విజేత సెయింట్ జోసెఫ్ స్కూల్

**నందలూరు(రాజంపేట) :** స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆ సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో పార్లమెంట్ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకుంది. గురువారం అరవపల్లెలోని నందలూరు జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో జరిగిన కబడ్డీ పోటీల్లో దాదాపు 12 జట్లు పాల్గొన్నాయి. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంత లోకో పైలట్ షేక్ కమాల్ బాషా ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా బుల్లెట్ హరి, శాంత కుమార్, అజయ్, హరిబాబులు వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు పల్లె గ్రీష్మంత్ రెడ్డి, పుత్తా శంకర్, ముమ్మడి శెట్టి సుధాకర్, అరుణ్ యాదవ్, లోక్‌మాన్ సింగ్, స్వర్ణాంధ్ర సంస్థ సభ్యులు కీర్తన, సౌందర్య రాజ్, జశ్వంత్, పాఠశాల డ్రిల్ మాస్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### సత్ప్రవర్తన కలిగి ఉండాలి

**సిద్దవటం :** అందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని గాంధీ వీధిలో బుధవారం రాత్రి యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పాల్పడకుండా స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పెద్ద ఓబన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.